క్లుప్తంగా

అరసవల్లిలో ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి సన్నిధిలో భక్తులకు, ఆలయ సిబ్బందికి, అర్చకుల ఆరోగ్య పరీక్షల నిమిత్తం శనివారం స్థానిక మెడికవర్ ఆస్పత్రి యాజమాన్యం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించింది. వైద్యులు ప్రభు, పల్లవిల ఆధ్వర్యంలో భక్తులకు వైద్య పరీక్షల్లో భాగంగా బీపీ, సుగర్ తదితర పరీక్షలను నిర్వహించారు. మందులను ఇవ్వడంతో పాటు ఆరోగ్య అలవాట్లను వైద్యులు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



తాళ్లవలసలో గర్భిణులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

లావేరు: గర్భిణుల ఆరోగ్యం పట్ల ప్రత్యే శ్రద్ధ తీసుకుంటున్నట్లు లావేరు పీహెచ్‌సీ వైద్యులు మౌనిక, మణిభూషణ్ తెలిపారు. మండలంలోని లావేరు పీహెచ్‌సీ పరిధిలో గల పలు గ్రామాల్లో గర్భిణులకు వ్యాక్సినేషన్ వేశారు. ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణులకు ఆరోగ్య సమస్యలు రాకుండా ఉండటం కోసం ఉచితంగా టీకాలు వేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు చేయించుకోవాలన్నారు. సచివాలయాల ఏఎన్‌ఎంలు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పశువులకు లంపీ స్కిన్ టీకాలు



నాగంపాలెంలో పశువులకు లంపీ స్కిన్ టీకాలు వేస్తున్న సిబ్బంది

లావేరు: మండలంలోని పలు గ్రామాల్లో పశువులకు ఉచితంగా లంపీ స్కిన్ టీకాలు శనివారం వేశారు. నాగంపాలెం, బొడ్డపాడు, లింగాలవలస, వెంకటాపురం, లావేరు గ్రామాల్లో పశువులకు లంపీ స్కిన్ వ్యాధి రాకుండా ఉండటం కోసం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా టీకాలు వేశారు. సచివాలయాల వెటర్నరీ అసిస్టెంట్లు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


బహుళ పంటలతో భూసారం



సేంద్రియ ఎరువును పిచికారీ చేస్తున్న రైతులు

ఎచ్చెర్ల: ప్రకృతి వ్యవసాయం ద్వారా బహుళ పంటలు పండించడం వల్ల భూమి సారవంతం అవుతుందని కేశవరావుపేట ప్రకృతి వ్యవసాయం సమన్వయకర్త వై.చంద్రకళ అన్నారు. శనివారం కేశవరావుపేట యూనిట్‌లోని ఎస్.ఎం.పురం, కేశవరావుపేట, లక్ష్ముడుపేట, ఫరీద్‌పేటలోని రైతులకు బహుళ పంటలపై అవగాహన కల్పించారు. ఒకేసారి పంటలు వేయడం వల్ల ఒక పంటపోయినా మరోపంట చేతికి వస్తుందన్నారు. దీనివల్ల భూమికి సూర్యరశ్మి ఎక్కువగా తగలకుండా ఉంటుందని, భూమి కొట్టుకుపోకుండా ఉంటుందన్నారు. ఎక్కువ పంటలు ఒకేసారి ఉంటే చీడపీడలు, పురుగు రాకుండా ఉంటాయన్నారు. కూరగాయల పంటలకు సేంద్రియ ఎరువులను పిచికారీ చేయాలని సూచించారు. సిబ్బంది రాంబాబు, గున్నంనాయుడు, పద్మావతి, రాజేశ్వరి, వెంకటేశ్వరి పాల్గొన్నారు.

వందేవిశ్వభారత్ పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న అవధాని పద్మాకర్

శ్రీకాకుళం కల్చరల్: సాహితీ చైతన్య కిరణాలు, బాల కథానిలయం ఆధ్వర్యంలో రూపొందిన వందేవిశ్వభారత్ పుస్తకావిష్కరణ కార్యక్రమం బాపూజీ కళామందిర్‌లో శనివారం జరిగింది. ప్రముఖ తెలుగు పండితులు, అవధాని వద్దిపర్తి పద్మాకర్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకంలో గరిమెళ్ల సత్యన్నారాయణ దేశభక్తి గేయాలు, గున్నమ్మ చరిత్ర, స్వాతంత్ర్య సమర యోధుల పోరాటాలను పొందుపరిచామని పుస్తక రచయిత బి.ఉమామహేశ్వరరావు తెలిపారు.

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

గార: అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి అన్నారు. వారిని స్మరించుకుంటూ దేశ ఔన్నత్యాన్ని నలుదిశలా వ్యాపించేలా చూద్దామని పిలుపునిచ్చారు. అంపోలు పంచాయతీ లింగాలవలస సచివాలయం పరిధిలో సర్పంచ్ గొండు రఘురామ్ అధ్యక్షతన శనివారం జరిగిన నా మట్టి- నాదేశం కార్యక్రమంలో భాగంగా అమరవీరుల పేరిట శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంజీవి రమణయ్య, ఎంపీటీసీ సభ్యులు ముద్దాడ గోవిందరావు, పాదిలాపు రామజోగి పాల్గొన్నారు.

నైరాలో నాభూమి-నాదేశం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధి నైరా గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో 'నాభూమి-నాదేశం' కార్యక్రమం స్థానిక సర్పంచ్ అరవల రామ్ ప్రతాప్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛమైన నీరు, గాలి, సారవంతమైన నేల భావితరాలకు అందించేలా పుడమి తల్లిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయం పరిధిలో, స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామ్మోహన్‌రావు, ఈవోపీఆర్‌డీ ప్రకాశరావు, ఏపీడీ మురళీకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు చంద్రమౌళి, వాటుపల్లి కృష్ణ పాల్గొన్నారు.

ఎచ్చెర్లలో..

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలో కొంగరాం, కేశవరావుపేట గ్రామాల్లో శనివారం నా భూమి-నాదే శం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ మొదలవలస చిరంజీవి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మాజీ సైనికులను సత్కరించారు. మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు మురళీధర్‌బాబా, సర్పంచ్‌లు పైడి భాస్కరరావు, గుండ భాగ్యశ్రీ, నాయకులు కొత్తకోట సూర్యారావు, గుండ రవి, ఉపాధి హామీ ఏపీఓ శోభాదేవి పాల్గొన్నారు.

లావేరులో..

లావేరు: మండలంలోని పలు గ్రామాల్లో నా భూమి నా దేశం, నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం, కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. గురుగుబిల్లి, బొంతుపేట, బెజ్జిపురం, బొంతుపేట, అప్పాపురం, శిగురుకొత్తపల్లి, పెదలింగాలవలస, పోతయ్యవలస, కొత్తకోట, లావేరు , వెంకటాపురం పంచాయతీల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు మట్టిని పూజించడం, మొక్కలు నాటడం, ప్రతిజ్ఞ వంటి కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీఓ కె సురేష్‌కుమార్, ఉపాధి ఏపీఓ ఆర్ సత్యవతి, లుకలాపు అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ లుకలాపు శ్రీనివాసరావు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ మీసాల సీతన్నాయుడు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, బొంతు సూర్యనారాయణ, సర్పంచ్‌లు శాంతాటి భాస్కరరావు, బొంతు అరుణఎల్లంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఎచ్చెర్ల క్యాంపస్: కొంగరాంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ చిరంజీవి

రణస్థలంలో..

రణస్థలం: స్వాతంత్ర్య సమరయోధులను గౌరవిస్తూ ప్రతీ పౌరుడు దేశభక్తి కలిగి ఉండాలని తిరుపతిపాలెం సర్పంచ్ ఆకుల రవికుమార్ అన్నారు. గ్రామంలో నా భూమి-నా దేశం కార్యక్రమం నిర్వహించారు. నేలతల్లికి నమస్కారం , వీరులకు వందనం సమర్పించడం ఎంతో పుణ్యమన్నారు. గ్రామస్తులంతా మట్టిని పట్టుకుని ప్రతిజ్ఞ చేసి మొక్కలు నాటారు. గ్రామస్తులు ఆకుల గోపి, మండల రవి, వాళ్లె హరిబాబు, మండల అసిరినాయుడు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జి.సిగడాంలో..

జి.సిగడాం: స్వాతంత్ర్య మహోత్సవంలో యువత, గ్రామస్తులు అంతా భాగస్వాములు కావాలని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కంది రమాదేవి అన్నారు. మండలంలోని ఎస్‌పీఆర్ పురం, సేతుభీమవరం పంచాయతీలో మేరా మట్..మేరా దేశ్ కార్యక్రమాలను నిర్వహించారు. మొక్కలు నాటారు. సర్పంచ్ తొత్తడి రామారావు, ఏపీఓ సత్యనారాయణ, ఈసీ పురిషోతంనాయుడు, పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు పాల్గొన్నారు.



గార: లింగాలవలసలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కృష్ణమూర్తి తదితరులు



శ్రీకాకుళం రూరల్: ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు, అధికారులు



లావేరు: పెదలింగాలవలసలో మొక్కలు నాటుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



రణస్థలం: తిరుపతిపాలెంలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న గ్రామస్తులు



జి సిగడాం: సేతుభీమవరంలో మొక్కను నాటుతున్న వెంకటరమణ, తదితరులు

గ్రంథాలయశాస్త్ర పితామహుడికి నివాళి



ఎచ్చెర్ల క్యాంపస్: రంగనాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయశాస్త్ర పితామహుడు ఎస్.ఆర్.రంగనాథన్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి మలిపెద్ది చంద్రశేఖర్ ఆయన చేసిన సేవలు విద్యార్థులు, పాఠకులకు వివరించారు.

లావేరులో..



లావేరు: రంగనాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి, విద్యార్థులు

లావేరు: మండల కేంద్రంలో గల గ్రంథాలయంలో ఎస్.ఆర్ రంగనాథన్ జయంతిని నిర్వహించారు. రంగనాథన్ చిత్రపటానికి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాలలు వేశారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలి

- మంత్రి ధర్మానకు సర్పంచ్‌ల వినతి

శ్రీకాకుళం రూరల్: విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని రాగోలు, వాకలవలస, లంకాం, గూడెం పంచాయతీ సర్పంచులు కోరారు. ఈ మేరకు మంత్రి ధర్మాన ప్రసాదరావును తన క్యాంపు కార్యాలయంలో శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఇదివరకు రాగోలు సబ్‌స్టేషన్ నుంచి చుట్టుపక్కల గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండేదని.. ప్రస్తుతం అక్కడ నుంచి వేరేచోటుకు సబ్‌స్టేషన్‌ను మార్చడంతో సమస్య ఉత్పన్నమైందన్నారు. ఎప్పటికప్పుడు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతోందని మంత్రికి వివరించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ వెంటనే ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు. మంత్రి ధర్మానను కలిసిన వారిలో సర్పంచ్‌లు చిట్టి రవికుమార్, గేదెల శంగల్వరావు, అల్లు లక్ష్మీనారాయణ, యజ్జల గురుమూర్తి ఉన్నారు.



మంత్రి ధర్మానకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్‌లు

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి ధర్మాన ప్రసాదరావు
- రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రజలకు మెరుగైన రోడ్లు, మంచినీరు, మౌలిక సదుపాయాలు కల్పించి సమస్యలు లేని కార్పొరేషన్‌గా తీర్చిదిద్దడమే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలో పలు రోడ్ల నిర్మాణ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్లను నిర్మించామన్నారు. కార్పొరేషన్ పరిధిలో కొత్తగా చేపట్టనున్న రోడ్డు పనులకు రూ.10 కోట్లు వెచ్చించామన్నారు. పాత శ్రీకాకుళంలో సంతోషిమాత గుడి దగ్గర నుంచి కిన్నెర థియేటర్ వరకూ రూ. 62 లక్షలతో రోడ్డు వేయనున్నట్టు చెప్పారు. అలాగే సంతోషిమాత గుడి దగ్గర నుంచి కలెక్టరేట్ వరకూ 40 లక్షల రూపాయలతో రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్టు పేర్కొన్నారు. కోటి రూపాయలకు పైగా నిధులు వెచ్చించి ప్రయాణికుల సౌకర్యార్థం అత్యంత నాణ్యమైన రోడ్డు వేసేందుకు ఇప్పటికే టెండర్లు ఖరారు చేశామన్నారు. కేఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ వారు ఈ పనులు చేపట్టనున్నట్టు వెల్లడించారు. నగర అభివృద్ధిలో భాగంగా ఇతర రహదారుల నిర్మాణానికీ ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో తూర్పుకాపు, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మెంటాడ పద్మావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు సాధు వైకుంఠరావు, ఎన్ని ధనుంజయరావు, చల్ల శ్రీనివాస్, సుంకరి కృష్ణ, కె.ఎల్.ప్రసాద్, కర్నేన పద్మావతి, డిపి దేవ్, ఆలుగుబెల్లి నాగభూషణరావు, కర్నేన హరి, కోణార్క్ శ్రీను, అల్లు లక్ష్మీనారాయణ, కర్రి రంగాజీదేవ్, పాపారావు, సీపాన రామారావు పాల్గొన్నారు.



శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు

నేడు శ్రీకాకుళంలో ఏపీఎల్ రన్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) రన్ శ్రీకాకుళంలో జరగనుందని ఆ సంఘ జిల్లా అధ్యక్షులు పీవైఎస్ శాస్త్రి, కార్యదర్శి హసన్‌రాజ షేక్ తెలిపారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని ఏసీఏ-వీడీసీఏ వైఎస్సార్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా ఈనెల 16వ తేదీ నుంచి ఏపీఎల్-2 మొదలుకానుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఏపీఎల్-2కు సంఘీభావంగా ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోను ఈనెల 13వ తేదీన ఏపీఎల్ రన్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా శ్రీకాకుళంలో వైఎస్సార్ సర్కిల్ సమీపంలో ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ నుంచి పాలకొండ రోడ్, డే అండ్ నైట్ జంక్షన్, అంబేడ్కర్ జంక్షన్ మీదుగా ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్) కళాశాల మైదానం వరకు ఏపీఎల్ రన్ కొనసాగుతుందని శాస్త్రి, హసన్‌రాజ పేర్కొన్నారు.

కవులు బాధ్యతగా స్పందించాలి

శ్రీకాకుళం కల్చరల్: దేశంలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలపై స్పందించి గొంతెత్తడం కవుల, రచయితల బాధ్యతని కవి చింతాడ తిరుమలరావు అన్నారు. సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో యూటీఎఫ్ కార్యాలయంలో 'రగులుతున్న దేశమా నీ పయనమెటు'అనే అంశంపై కవితా గోష్ఠి శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మణిపూర్ హర్యానా, ఉత్తరప్రదేశ్‌లలో మత చిచ్చు రగిలిస్తున్న శక్తులు చెలరేగి మహిళలను నడివీధుల్లో నగ్నంగా నడిపించి దేశ ప్రతిష్ఠను దిగజార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులను చూస్తూ సహించి ఊరుకోవడం మేధావులకు తగదన్నారు. ప్రజా చైతన్యాన్ని రగిల్చే కృషిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం కవితా గోష్ఠిలో పలువురు కవులు తమ స్వీయ కవితల్ని పఠనం చేశారు. మంటల జాతర, భూకంప సంకేతం, శఠగోపం, డాక్టర్ నీరో మోదీ అనస్తటిస్ట్, విస్పష్ట గమనం, దేశమా నీపయనమెటు, ఖబడ్దార్, అసంకల్పిత తిరుగుబాటు తత్త్వం అనే కవితలను బాడాన శ్యామలరావు, నెట్టిమి రమణారావు, కె.శ్రీనివాసు, వి.జి.కె.మూర్తి, కంచరాన భుజంగరావు, తంగి ఎర్రమ్మ, చింతాడ కృష్ణారావు పఠనం చేశారు. చింతాడ రామచంద్రరావు సినారె గజల్‌ను గానం చేశారు. సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాసు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పి.సుధాకరరావు, ఆర్.మధుసూదనరావు, డి.సూర్యతేజ, ఎకరం గోవర్దన్‌రావు, చంద్రశేఖరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తిరుమలరావు

నిబంధనలు పాటించాలి



ఓ ప్రైవేటు పాఠశాలను పరిశీలిస్తున్న సీఆర్‌పీఎఫ్ ప్రతినిధులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని చైల్డ్‌రైట్స్‌ఫోరం జిల్లా కన్వీనర్ కొత్తకోట శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మొదలవలస వాసుదేవ్‌లు అన్నారు. రెండో శనివారం సెలవును విధిగా పాటించాలని సూచించారు. ఈ మేరకు పలు పాఠశాలలు, కళాశాలలను శనివారం పరిశీలించారు. ప్రభుత్వం రెండో శనివారం పక్కాగా అమలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ కొన్ని విద్యా సంస్థలు రకరకాల పరీక్షల పేరిట తరగతులు నిర్వహించడం సరికాదన్నారు. బాలలహక్కుల ఉల్లంఘన కింద ఇదే అంశాన్ని విద్యాశాఖ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీ, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ప్రజా అంబులెన్సు ప్రారంభం

కాశీబుగ్గ: ఆ నలుగురు ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రజా అంబులెన్సు సర్వీసును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ట్రస్టు సభ్యులు ఎస్.ఈశ్వరరావు, టి.తేజేశ్వరరావు కోరారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఐదు సంవత్సరాలుగా ఆ నలుగురు ట్రస్ట్ రక్తదాన కార్యక్రమాలు చేసి ప్రజల మన్ననలు పొందింది. ఇప్పుడు నిరుపేదల అత్యవసర పరిస్థితుల కోసం ఉచిత అంబులెన్సు ప్రారంభించామన్నారు. అవసరం ఉన్న వారు 94948 74383, 96766 03047 నంబర్లను సంప్రదించాలన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీతో పాటు పరిసర ప్రాంతాల వారికి అందుబాటులో ఉంచామన్నారు.

సాగుహక్కుదారులకు పట్టాలు ఇవ్వాలి

రణస్థలం: మండలంలోని ఎస్సీ కులస్తుల అనుభవంలో ఉన్న కొండపోరంబోగుకు సాగుహక్కు కల్పించాలని సామాజిక న్యాయం పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాసి గణేష్ తెలిపారు. మహంతిపాలెంలో 127 సర్వే నంబర్‌లో సుమారుగా 15 ఎకరాలు గత కొన్నేళ్లుగా సాగుచేస్తున్న భూముల్లో దళిత సంఘాల నాయకులు శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహంతిపాలెం భూ సమస్యపై దళిత సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ ఉదయం 10 గంటలకు రణస్థలంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్కా కృష్ణయ్య, సమత సైనిక్ దళ్ నాయకుడు నేతల అప్పారావు, బహుజన పార్టీ నాయకులు గంట్లాన రామారావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మహంతిపాలెంలో నినాదాలు చేస్తున్న దళిత సంఘ నాయకులు

పోస్టల్ ఉద్యోగుల బైక్ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న పోస్టల్ సిబ్బంది

శ్రీకాకుళం అర్బన్: ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగురవేసే కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం ప్రధాన పోస్టల్ కార్యాలయం నుంచి రామలక్ష్మణ్ థియేటర్ వరకు పోస్టల్ ఉద్యోగులు శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం హెడ్‌పోస్టుమాస్టార్ దన్నాన చంద్రశేఖర్, పోస్టల్ సూపరింటెండెంట్ సత్యన్నారాయణ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య అమృత మహోత్సవ ముగింపు కార్యాక్రమంలో భాగంగా గత ఏడాది నుంచి ఇంటింటికీ జాతీయ జెండా నినాదాన్ని కొనసాగిస్తూ వచ్చామన్నారు. ఈ ఏడాది కూడా ప్రతి ఇంటా జాతీయ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సంబరాలు జరుగుతున్న వేళ జిల్లా వ్యాప్తంగా ప్రతి పోస్టాఫీసులో నాణ్యమైన జాతీయ జెండాను 25 రూపాయలకే విక్రయిస్తున్నామన్నారు. ఆన్‌లైన్‌లో కూడా కొనుగోలు చేసుకునే అవకాశం ఉందని చెప్పారు. పోస్టాఫీసులో ఆదివారం కూడా ప్రత్యేక కౌంటర్ల ద్వారా జెండాలు అమ్మకాలు సాగిస్తామన్నారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: గుజరాతీపేటలోని నారాయణ తిరుమల కొండపై వెలసిన వేంకటేశ్వరుని ఆలయంలో పరమ ఏకాదశి పర్వదినం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి దర్శనానికి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామికి ప్రత్యేక అష్టోత్తర శతనామాలతో పూజలు, ప్రత్యేక దర్శనాలు, ఉచిత దర్శనాలను భక్తులు చేశారు. అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు భక్తుల గోత్రనామాలతో అర్చనలు చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వేంకటరామానుజ సేవాదళం ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు.



గార: స్వామివారికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

వేణుగోపాలుడుకి..

గార: శాలిహుండం కొండపైనున్న కాళీయ మర్దన వేణుగోపాలస్వామికి పరమ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిగాయి. ఆలయ ధర్మకర్త సుగ్గు మధురెడ్డి దంపతులు స్వామికి క్షీరాభిషేకం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సూరిబాబు శిష్యబృందం భగవద్గీత పారాయణం చేశారు.

రంగనాథన్‌కు ఘనంగా నివాళి

టెక్కలి: దేశంలో గ్రంథాలయాల అభివృద్ధికి ఎస్.ఆర్.రంగనాథన్ చేసిన కృషి ఎనలేనిదని టెక్కలి శాఖా గ్రంథాలయాధికారి బి.రూపావతి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహుడు రంగనాథన్ జయంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. విశ్రాంత గ్రంథాలయాధికారులను సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత గ్రంథాలయాధికారులు జి.ప్రసాదరావు, టి.వైకుంఠరావు, కె.బి.సుబ్రహ్మణ్యం, ఎస్.రామారావు, లైబ్రేరియన్ జి.భారతి పాల్గొన్నారు.



టెక్కలి: రంగనాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం